సాక్షి జనగామ

బుధవారం । 15 । నవంబర్ । 2023



‘దీపావళి బతుకమ్మ’ సంబురాలు

హసన్‌పర్తి మండలం సీతంపేటలో ‘దీపావళి సంబురాలు’ వైభవంగా కొనసాగుతున్నాయి.

- 10లో▸



ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ఉన్నత విద్యలో రాణిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఫాదర్ దిలీప్‌కుమార్ విద్యార్థులకు సూచించారు.

- 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $30^{0}/19^{0}$

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉండి రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఘనంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్తజనసందోహం నడుమ 108 బంగారు పుష్పాలతో అష్టదళ పాద పద్మారాధన పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంను అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల నడుమ స్వామి వారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, కుంచాల సంపత్‌రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది రమేష్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్, అజయ్, రాములు, వసంత, భక్తులు పాల్గొన్నారు.

శంభో శంకర.. హరహర మహాదేవ



జనగామ: కార్తీక మాస పర్వదినం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా మొదటి మంగళవారం కార్తీక మాస వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బాణాపురం అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యే శ్వర స్వామికి పంచామృత అభిషేకములు, విశేషమైన అలంకరణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్దేశ్వర స్వామి, పాత బీటు బజారు శ్రీరామలింగేశ్వర, చీటకోడూరు శ్రీ పంచ కోసు రామలింగేశ్వర ఆలయాలతో పాటు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో శివాలయాలు, విష్ణు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీసోమేశ్వర ఆలయంలో

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక మాసం పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

‘సృజనాత్మకత పరిశోధనలు అవసరం’



జనగామ రూరల్: నేటి విద్యార్థులు తమ సృజనాత్మకత పరిశోధనలు ప్రస్తుత సమాజానికి అవసరమని క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ వి. విజయపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో మానవ వనరుల అభివృద్ధి అనుబంధ సంస్థగా ఐఐసీ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పరిశోధన పట్ల ఆసక్తి ఉన్న యువతకు ఈ సంస్థ ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ఎం. లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా పరిశ్రమ అధికారి రమేష్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఐఐసీ కో ఆర్డినేటర్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

జనగామ రూరల్: ఉపాధి కూలీలకు పని కల్పించి రానున్న ఏడాది గ్రామాల్లోని నర్సరీల్లో విరివిగా మొక్కలు పెంచాలని అదనపు డీఆర్‌డీఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్యదర్శులు ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హసీం, ఎంపీఓ సంపత్‌కుమార్, ఏపీఓ భిక్షపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పాడితో జీవనోపాధి

బచ్చన్నపేట: రైతులు వ్యవసాయంతో పాటు పాడితో జీవనోపాధి పొందాలని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పాడి పరిశ్రమ అభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆలేరు నుంచి పాడి కేంద్రాన్ని జనగామకు మార్చడం జరిగిందని, ప్రస్తుతం పురోగాభివృద్ధి సాధిస్తుందన్నారు. అంతకు ముందుకు సమావేశంలో రాజకీయ ప్రస్తావన రావడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమిరెడ్డి, జోగిరెడ్డి, రామకృష్ణ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉద్యమ పటిమ ప్రదర్శించండి



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు




తొర్రూరులో జరిగిన పాలకుర్తి నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు హాజరైన జనం

పాలకుర్తి పోరాటాల గడ్డ

- చెక్‌డ్యామ్‌లరావుగా దయాకర్‌రావు
- ఇంటికెళ్లి అందరూ చర్చపెట్టి ఓటేయాలి
- పాలకుర్తి ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు.. జోష్
- ఎంత చేసినా మీ రుణం తీర్చుకోలేను
- మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షి, మహబూబాబాద్/తొర్రూరు: ‘పాలకుర్తి పోరాటాల గడ్డ. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, బందగీ, పోతనామాత్యుడి పోరాట పటిమను ఓటు ద్వారా ప్రదర్శించాలి’ అని సీఎం కేసీఆర్ అన్నారు. మంగళవారం తొర్రూరులో పాలకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపు కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలోచించి ఓటు వేస్తారా? 24 గంటల విద్యుత్ కావాలా? 3 గంటల విద్యుత్ కావాలా? రైతుబంధు కావాలా.. వద్దా? ధరణి ఉంచాలా.. తీసేయాలా? అని కార్యకర్తలను ప్రశ్నించి సమాధానం రాబట్టారు. 30వ తేదీన ఆలోచించి ఓట్లు వేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. వాగులపై చెక్ డ్యామ్‌లు కట్టడం కోసం వందల కోట్లు తెచ్చిన దయాకర్‌రావును.. చెక్‌డ్యామ్‌ల రావుగా కేసీఆర్ అభివర్ణించారు. కరువు కాటకాలతో ఒకప్పుడు పాలకుర్తి ఉండేదని, దాన్ని తలుచుకుంటేనే కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయన్నారు. చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. అందుకోసం పని చేసిన నాయకులను మరవొద్దని, ఇంటికెళ్లి అందరూ చర్చపెట్టి ఓటేయాలని కోరారు. కేసీఆర్ ప్రసంగంతో వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తల్లో జోష్ కన్పించింది. ఈలలు, కేరింతలతో సభ సాగింది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు కె.కేశవరావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎంపీ దయాకర్, రాష్ట్ర ఆరోగ్యశ్రీ చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు, సీనియర్ నాయకులు మధుసూదనాచారి, నూకల నరేశ్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆనందభాస్కర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఉషా దయాకర్‌రావు, గాంధీనాయక్, తొర్రూరు మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

దయన్న అంటేనే ధైర్యం: పాలకుర్తి అభ్యర్థి దయాకర్ రావు



‘దయన్న అంటేనే ధైర్యం, ప్రజల కోసం కడదాక నిలబడతా’ అని పాలకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్ రావు అన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చినట్లు తెలిపారు. రూ.10 కోట్లు వెచ్చించి మహిళలకు కుట్టు శిక్షణ, నిరుద్యోగ యువతకు ఉచిత ఉద్యోగ శిక్షణ, డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించినట్లు తెలిపారు. కేసీఆర్ సహకారంతో తొర్రూరును మున్సిపాలిటీగా, రెవెన్యూ డివిజన్‌గా మార్చానని ఆయన పేర్కొన్నారు. తొర్రూరులో 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయించానని, పెద్ద వంగరను మండలంగా చేశానని గుర్తు చేశారు. కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేయించానన్నారు. సన్నూరు వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.15 కోట్లు వెచ్చించానని తెలిపారు. భద్రాద్రిని తలపించేలా వల్మిడిని అభివృద్ధి చేశానని, బమ్మెర పోతన జన్మస్థలానికి రూ.25 కోట్లు వెచ్చించానని పేర్కొన్నారు. కేసీఆర్ సహకారంతో తొర్రూరులో ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు, పాలకుర్తిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసుకుంటామన్నారు. కంటి ముందు ఉండే తాను కావాలో.. ఓట్ల తర్వాత కన్పించకుండాపోయే వాళ్లు కావాలో నిర్ణయించుకోవాలన్నారు. ఇన్నిసార్లు గెలిపించినా మీ రుణం తీర్చుకునేందుకే అభివృద్ధి పనులు చేశానన్నారు. మరోసారి గెలిపించి మీ సేవకుడిగా ఉండే అవకాశం ఇవ్వాలని మంత్రి కోరారు.

కాంగ్రెస్ నేతలను నిలదీయండి: మంత్రి సత్యవతి రాథోడ్



40 ఏళ్లు పాలించిన కాంగ్రెస్.. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని, వారి హయాంలో జరిగిన పనులు శూన్యమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో అనేక పథకాలు అమలు చేస్తున్నారని, తెలంగాణ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. 24 గంటల కరెంట్ కావాలన్నా.. రైతుబంధు, బీమా, నీళ్లు, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా.. బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలన్నారు. దారితప్పి కాంగ్రెస్ గెలిస్తే అభివృద్ధి ఆగిపోతుందన్నారు.



సైడ్‌లైట్స్

- మధ్యాహ్నం 1.25 గంటలకు హెలికాప్టర్ సభ ప్రాంగణానికి చేరింది. 1.50 గంటలకు సీఎం కేసీఆర్ సభావేదికపైకి చేరుకున్నారు. 2.16 గంటల వరకు ప్రసంగించారు. 26 నిమిషాల పాటు ప్రసంగం సాగింది.
- 2.38 గంటలకు హెలికాప్టర్‌లో తొర్రూరు నుంచి నల్లగొండ జిల్లా హాలియాకు బయలుదేరి వెళ్లారు.
- సీఎం ప్రసంగం మధ్యలో ప్రజలు విజిల్స్ వేస్తుండడంతో సీటీలు వేయకండని మూడు సార్లు అభ్యర్థించారు. గెలిచాక సీటీలు కొట్టండని కోరారు.
- హెలికాప్టర్ సభ ప్రాంగణంపై మూడు రౌండ్లు వేయడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.
- చిందు యక్షగాన కళాకారులు, తనువంతా గులాబీరంగు, కేసీఆర్ బొమ్మతో ఉన్న వ్యక్తి కని పించడంతో అతడితో కార్యకర్తలు ఫొటోలు దిగారు.
- రహదారులు చిన్నగా ఉండడం, ప్రజలంతా ఒకేసారి తరలిరావడంతో అన్ని రహదారులు స్తంభించాయి.
- పోలీసులు పార్కింగ్ ఏర్పాట్లపై సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో కొన్నిచోట్ల ఇబ్బందులు ఎదురయ్యాయి.
- సీఎం ప్రసంగిస్తున్నంత సేపు ప్రతిపక్షాలను విమర్శించినా.. దయాకర్‌రావును అభినందించినా.. సంక్షేమ పథకాలను గుర్తు చేసినా.. సభ హోరెత్తడంతో ప్రతిసారి ప్రసంగాన్ని ఆపిఆపి కొనసాగించాల్సి వచ్చింది.
- ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ ఆధ్వర్యంలో డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు, భారీగా పోలీసులను మోహరించారు.

కేసీఆర్ దుష్టపాలనకు చరమగీతం పాడండి



స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన విజయభేరి సభకు హాజరైన జనం

రాష్ట్రంలో మార్పు రావాలి..

- కడియం, రాజయ్య గుణగణాలు అందరికి తెలుసు
- ఉపముఖ్యమంత్రి ఉద్యోగం ఇచ్చిన కేసీఆర్ వీరి గురించి తెలిసి ఊడగొట్టాడు..
- ల్యాండ్ పూలింగ్‌తో వర్ధన్నపేట రైతుల మెడపై కత్తి
- రైతులను పోలీసులతో తన్నించిన అరూరి రమేశ్
- స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ (వర్ధన్నపేట) బహిరంగ సభల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన విజయభేరి సభలో అభివాదం చేస్తున్న టీపీసీసీచీఫ్ రేవంత్‌రెడ్డి, అభ్యర్థి సింగపురం ఇందిర

సాక్షి, వరంగల్/స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/జనగామ: చరిత్రలో శిశుపాలుడి వంద తప్పులు పూర్తయ్యాక శిరచ్ఛేదనం జరిగిన మాదిరి తెలంగాణ పాపాల భైరవుడు కేసీఆర్ పాలనకు చరమగీతం పాడుతూ ఇందిరమ్మ రాజ్యం వచ్చే దిశలో కాంగ్రెస్‌ను గెలిపించాలని టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో, వరంగల్ జిల్లా మామునూరు, తిమ్మాపురం రోడ్డులోని లక్ష్మీపురం మైదానంలో జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ విజయభేరి సభల్లో ఆయన మాట్లాడారు. ఈ రెండు నియోజకవర్గాల్లో బరిలో నిలిచిన సింగపురం ఇందిర, కేఆర్ నాగరాజును గెలిపించాలని పిలుపునిచ్చారు. సింగపురం ఇందిరను గెలిపించే బాధ్యతగా తానొక్కడినే కాకుండా అద్దంకి దయాకర్‌ను ప్రచార కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మహిళగా ఇందిరను నిలబెడితే కడియం శ్రీహరి, రాజయ్య మర్యాదపూర్వక విమర్శలను విస్మరిస్తూ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారన్నారు. వారికి ప్రజలు ఓటుద్వారా కర్రుకాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. వీరిద్దరికి కేసీఆర్ ఉపముఖ్యమంత్రులుగా ఉద్యోగం ఇచ్చి, ఆ తర్వాత జాతకాలు తెలుసుకుని ఊడగొడితే.. ఒకరి సంగతి ఒకరు స్టేషన్‌లో చెప్పుకోవడం ప్రజలు చూశారన్నారు. వీరిద్దరు కీలక శాఖల్లో పనిచేసి డిగ్రీ కళాశాల, వంద పడకల ఆస్పత్రి తేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి పాలకులకు గుణపాఠం చెప్పి ఇందిరను గెలిపిస్తే సత్వరమే ఆ రెండు హామీలను నెరవేరుస్తామన్నారు. రాష్ట్రంలో మార్పు కావాలి, కాంగ్రెస్ రావాలి, బైబై కేసీఆర్ అంటూ సభకు వచ్చిన ప్రజలతో నినదింపజేశారు. జెడ్పీ స్టాండింగ్ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవితోపాటు పలువురు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వర్ధన్నపేట కాంగ్రెస్ అడ్డా

‘ఇక్కడికి వచ్చిన ప్రజలను చూస్తుంటే.. వర్ధన్నపేట కాంగ్రెస్ అడ్డాగా కనిపిస్తోంది. ఈ ఎన్నికలు పోలీసులు, దొంగల మధ్య జరుగుతున్నవి. ఎటువైపు ఉంటారో ప్రజలు ఆలోచించాలి’ అని రేవంత్ రెడ్డి కోరారు. ‘2014కు కొనుక్కోవడానికి చెప్పులు లేని స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు ఇప్పుడు వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, వరంగల్‌లో వేలాది ఎకరాలు ఉన్నాయి. వర్ధన్నపేట ఎమ్మెల్యే అయ్యి ల్యాండ్ పూలింగ్ మీద మీ భూములు గుంజుకొని ఎందుకని అడిగితే పోలీసు బూట్లతో తన్నించాడు. ఆ వేళ ల్యాండ్ పూలింగ్‌కు వ్యతిరేకంగా కొట్లాడుతుంటే నేను వచ్చి మీతో కలిసి కూర్చున్నా. మీ తాతాల నుంచి వచ్చిన భూముల్లో సేద్యం చేస్తూ బతుకీడుస్తుంటే ఆ భూములు లాక్కొని రోడ్డున పడేసే ప్రయత్నం చేయలేదా అరూరి.. మీరు పోతే మీ మీదకు బండి ఎక్కించే ప్రయత్నం చేయలేదా. ఆలోచన చేయండి. ఈ ఎన్నికలు ఓ పోలీసు, దొంగ మధ్య జరుగుతున్నవి’ అని అన్నారు. ‘దయాకర్ రావు, రమేశ్ అయినా, ఇక్కడి నుంచి వలసవెళ్లిన శ్రీహరి అయినా.. వీరు ఎవరి ముందైనా గొంతు ఎత్తి మాట్లాడగలరా? ఈ బానిసలు మనకు ఎమ్మెల్యేలు కావాల్నా.. ప్రజలందరూ మార్పు కోరుకుంటున్నారు. వర్ధన్నపేట నుంచి కేఆర్ నాగరాజును, వరంగల్ వెస్ట్ నుంచి నాయిని రాజేందర్‌రెడ్డి, నర్సంపేట నుంచి దొంతి మాధవరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి’ అని ప్రజలను కోరారు. ఆయా సభల్లో ఏఐసీసీ అబ్జర్వర్ అరవింద్ దాల్వి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ శోభ, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, నాయకులు ఎర్రబెల్లి వరదరాజేశ్వర రావు, దేవేందర్ రావు, మేకల వరలక్ష్మి, లింగాజీ, నరేందర్‌రెడ్డి, చేపూరి చిరంజీవి, అమృతరావు, జగదీశ్‌రెడ్డి, కీసర దిలీప్‌రెడ్డి, కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, శ్రీరాములు ఉన్నారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న కడియం: కాంగ్రెస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి సింగపురం ఇందిర



కాంగ్రెస్ పార్టీకి వస్తున్న విశేష ఆదరణ చూసి ఓటమి భయంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి సింగపురం ఇందిర అన్నారు. విశేష రాజకీయ అనుభవం ఉన్న కడియం శ్రీహరికి స్థానికత అంటే తెలియకపోవడం విడ్డూరంగా ఉందని, మీకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, అత్తగారు ఊరు స్థానిక ఊరు కాదా, ఇక్కడ నాకు ఓటు ఉందని గుర్తు చేశారు. ఘన్‌పూర్‌కు రేవంత్‌రెడ్డి వస్తున్నాడంటే బీఆర్‌ఎస్ వాళ్లకు వణుకు పుడుతుందన్నారు. కడియం శ్రీహరి టీడీపీ హయాంలో 420 మందిని ఎన్‌కౌంటర్లు చేయించారని స్వయంగా హరీశ్‌రావు గతంలో చెప్పారని, ప్రస్తుతం ఆయన కిడ్నాప్‌ల శ్రీహరిగా మారారని ఎద్దేవా చేశారు.

నేను మీవాడినే.. ఆదరించండి: కాంగ్రెస్ వర్ధన్నపేట అభ్యర్థి కేఆర్ నాగరాజు



‘నేను ఇక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. ఇక్కడే చదివాను. ఇక్కడే ఉద్యోగం చేశాను. ఇక్కడి ప్రజలకు సేవ చేసేందుకు కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నా’ అని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట అభ్యర్థి కేఆర్ నాగరాజు అన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే అరూరి రమేశ్ అనకొండలాగా తయారైండని, కొండలు.. మట్టి మింగారని ఆరోపించారు. ‘గెరిల్లా లాగా బెదిరిస్తాడు. ఎక్కడ వెంచర్లు ఉంటే అక్కడ రోడ్లు, ల్యాండ్ పూలింగ్‌తో మన రైతు సోదరులను పోలీసులతో కొట్టించిండు. రైతు కన్నీరు కారిస్తే దేశానికి అరిష్టం. అర్జునుడిలా రేవంత్ రెడ్డి అన్న మనకు ఉన్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పేదల పాలన ఉంటుంది’ అని కేఆర్ నాగరాజు అన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

- ప్రతి ఓటరుకు స్లిప్పులు అందేలా చూడాలి
- రాష్ట్ర ఎన్నికల సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్

జనగామ రూరల్: ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతి ఓటరుకు స్లిప్పులు అందేలా చూడాలని రాష్ట్ర ఎన్నికల సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఓటర్ స్లిప్పుల కోసం ప్రత్యేక నోడల్ అధికారులను నియమించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని, స్థానికంగా అందుబాటులో ఉండే కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువతను వెబ్ క్యాస్టింగ్ కోసం వినియోగించుకోవాలని సూచించారు. స్లిప్పుల పంపిణీలో గతంలో అనేక ఫిర్యాదులు అందాయని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ముద్రణ చేసి పంపిణీ చేయాలన్నారు. స్లిప్పుల పంపిణీలో ఏమైన ఫిర్యాదులు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంపిణీ ప్రణాళికను రాజకీయ పార్టీలకు ముందస్తుగా తెలియజేయాలని, పార్టీలతోపాటు బీఎల్‌ఏలను స్లిప్పుల పంపిణీలో భాగస్వామ్యం చేయాలన్నారు. సీ–విజిల్ యాప్‌ను విస్తృతంగా వినియోగించుకోవాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను అరికట్టేందుకు ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివలింగయ్య తెలిపారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఈ వీసీలో జిల్లా సహాయ ఎన్నికల అధికారి సుహాసిని, డీఆర్‌డీఓ మొగిలప్ప, సీపీఓ ఇస్మాయిల్, ఎస్‌బీసీ రాంప్రసాద్, దుర్గారావు, ఏఓ రవీందర్, తహసీల్దార్లు శ్రీనివాస్, విక్రమ్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ఎన్నికల అబ్జర్వర్‌లు రాజమణి, రవిష్‌గుప్తా, గన్నత్ ఝూ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శివలింగయ్య అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులు తెలుసుకోవాలన్నారు. అలాగే కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుహాసిని, డీసీపీ సీతారాం, ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, రఘుచందర్, శ్రీనివాస్ రావు, నాయకులు ఉడుత రవి, విజయ భాస్కర్, రావెల రవి, శ్రీధర్, ప్రకాష్, ఏఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెంబర్తి గ్రామంలో కౌంటింగ్ సెంటర్లను కలెక్టర్ శివలింగయ్య, అబ్జర్వర్లు సందర్శించి పలు సూచనలు చేశారు.

నత్తనడకన..

- మానుకోట నియోజకవర్గంలో సా..గుతున్న అభివృద్ధి పనులు
- ‘సాక్షి’ గ్రౌండ్ రిపోర్ట్

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్రం హోం మంత్రి మహమూద్ అలీ

ప్రతిసారి సెంటిమెంట్‌తో ఓట్లు పడవు

- బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు

- 10లో▸

కాంగ్రెస్ గెలుపు కోసం అరగుండు, అరమీసం



అరగుండు, అరమీసంతో తాటికాయల యాకయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడానికి చెందిన తాటికాయల యాకయ్య అనే కాంగ్రెస్ వీరాభిమాని ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, సింగపురం ఇందిర గెలుపొందాలని కోరుతూ అరగుండు, అరమీసంతో ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు, కాంగ్రెస్ గెలుపొందేవరకు అరగుండు, అరమీసంతో ఉంటానని ఆయన చెబుతున్నాడు. మంగళవారం ఘన్‌పూర్‌లో జరిగిన రేవంత్‌రెడ్డి సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం, నిందితుడితో పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్: నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని తాటికొండ గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఐలోని కిరణ్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించిన సంఘటన మంగళవారం జరిగింది. ఘన్‌పూర్ ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తాటికొండలో ఐలోని కిరణ్ బెల్ట్‌షాపులో దాడి చేసి అక్రమంగా నిల్వ చేసిన రూ.15,160 విలువ రకాల మద్యం, బీర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేటి బాలలే రేపటి మేధావులు

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్



మాట్లాడుతున్న సివిల్ జడ్జి విక్రమ్

జనగామ రూరల్: నేటి బాలలే భావి తరాలకు మేధావులు అవుతారని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సి. విక్రమ్ అన్నారు. మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతోపాటు ఆటల్లో ముందంజలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.రవీందర్, జ్యోత్స్న, శ్రీహరి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని బాలసదనంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంక్షేమాధికారి జయంతి పాల్గొని మాట్లాడారు.



బాలల దినోత్సవంలో పాల్గొన్న జిల్లా సంక్షేమాధికారి జయంతి

- మరిన్ని ఫొటోలు 11లో▸

జంగ్ తెలంగాణ



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ ప్రజాశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, పార్టీ సీనియర్ నేతలు కేశవరావు, రాపోల్ ఆనందభాస్కర్, నూకల నరేశ్ రెడ్డి, తదితరులు.



వరంగల్ జిల్లా మామునూరులో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి. చిత్రంలో వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థులు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, దొంతి మాధవరెడ్డి, పీసీసీ నేత అద్దంకి దయాకర్, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు ఇనగాల వెంకట్రామిరెడ్డి, దొమ్మాటి సాంబయ్య, ఎంబాడి రవీందర్, తదితరులు.

మైనారిటీల సంక్షేమమే ధ్యేయం

● రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ


మాట్లాడుతున్న హోం మంత్రి మహమూద్ అలీ

హన్మకొండ: మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పది సంవత్సరాల నుంచి ముస్లిం మైనారిటీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సమ్మేళనంలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, తెలంగాణ రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ మౌలానా యూసఫ్ జాహిద్, జనార్దన్ గౌడ్, మహమ్మద్ ఖుద్దూస్, నయీముద్దీన్, కరీమున్నీసా బేగం, జహీర్, అబ్దుల్ మాజీద్, మౌలానా పాల్గొన్నారు.

ప్రతిసారీ సెంటిమెంట్‌తో ఓట్లు పడవు

● బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు


మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

హన్మకొండ: ప్రతిసారీ సెంటిమెంట్‌తో ఓట్లు పడడం సాధ్యం కాదని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు అన్నారు. మంగళవారం హనుమకొండ విద్యానగర్‌లోని బీజేపీ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. తమను అవమానించడాన్ని ఉద్యమకారులు అసహించుకుంటున్నారన్నారు. రూ.లక్షల కోట్ల బడ్జెట్‌తో చేసింది ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో మొదటిసారి బీజేపీ అధికారంలోకి రావాలని, కేంద్రంలో మరోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటు కావాలని ప్రజలు ఆశిస్తున్నారన్నారు. సమావేశంలో రమేష్, సత్యనారాయణ, కొలను సంతోష్ రెడ్డి, తీగల భరత్, అమరేందర్ రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

నాగజ్యోతి గెలుపును ఎవరూ ఆపలేరు

● ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ములుగు ఇన్‌చార్జ్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి

హన్మకొండ: బీఆర్ఎస్ ములుగు అభ్యర్థి నాగజ్యోతి గెలుపును ఎవరూ ఆపలేరని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని నిత్య బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే సీతక్క ఓడిపోతానని అసహనానికి గురై స్పిరిట్, దొంగ సారా తయారు చేస్తున్నామని, లిక్కర్ పంచుతున్నామని, దొంగనోట్లు పంచుతున్నామని దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషనర్, ఎక్సైజ్ శాఖ విచారణ జరిపి అసత్య ఆరోపణలు చేసిన సీతక్కపై కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ రావు, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, నాయకులు మల్క రమేష, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



నత్తనడకన..

గ్రౌండ్ రిపోర్ట్
మహబూబాబాద్

మానుకోట నియోజకవర్గంలో సా..గుతున్న అభివృద్ధి పనులు

- నిధులున్నా వివిధ కార్యాలయాల నిర్మాణాలకు స్థలాల సమస్య
- పూర్తి కాని డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్‌లో వెలుగులోకి పలు విషయాలు..


పూర్తి కాని మానుకోట మున్సిపాలిటీ భవన నిర్మాణం

మహబూబాబాద్: పేరుకు జిల్లా కేంద్రం.. అభివృద్ధిలో మాత్రం మారుమూల పల్లెల కంటే అధ్వానం. డ్రెయినేజీ వ్యవస్థ నుంచి మొదలు.. మంచినీటి సరఫరా వరకు.. రహదారుల నుంచి మొదలు.. ప్రభుత్వ కార్యాయాల ఏర్పాటు వరకు చేపడుతున్న పలు అభివృద్ధి పనులు నత్తకు నడకనేర్పుతున్నాయి. ఫలితంగా ప్రజలు నిత్యం సమస్యలతో సవాసం చేస్తున్నారు. జిల్లా కేంద్రం ..మానుకోట నియోజకవర్గ పరిధిలో ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడ చేపడుతున్న పలు నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. నిధులు మంజూరైనా నిర్మాణాలకు స్థలాల కొరతతో పనులు ప్రారంభం కావడం లేదు. రెవెన్యూ రికార్డుల ప్రకారం జిల్లా కేంద్రంలో వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే అది కేవలం రికార్డులకే పరిమితమైంది.

నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలు

మానుకోట నియోజకవర్గంలో గతంలో మానుకోట, గూడూరు, నెల్లికుదురు, కేసముద్రం మండలాలు ఉన్నాయి. ఇటీవల ఇనుగుర్తి మండలం ఏర్పాటు చేశారు. దీంతో నియోజవర్గంలో మండలాల సంఖ్య ఐదుకు చేరింది. ఐదు మండలాలకు గాను 2,53,339 మంది ఓటర్లు ఉన్నారు. కాగా, నియోజకవర్గ పరిధిలో మానుకోట మున్సిపాలిటీగా జిల్లా కేంద్రంగా ఉంది. మున్సిపాలిటీ పరిధిలో 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు, 36 వార్డులు ఉన్నాయి.

జీపీ భవనంలోనే మున్సిపాలిటీ కార్యాలయం..

మానుకోట మున్సిపాలిటీ కార్యాలయం నేటికీ మానుకోట మేజర్ జీపీగా ఉన్న సమయంలో నిర్మించిన భవనంలోనే కొనసాగుతోంది. సరిపోను గదులు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అనంతారం రోడ్డులో భవన నిర్మాణానికి 2.18 ఎకరాల స్థలం కేటాయించారు. దీని నిర్మాణానికి మంత్రి కేటీఆర్ 2018 ఏప్రిల్ 4న శంకుస్థాపన చేశారు. భవనం జీప్లస్ నిర్మాణం చేపట్టినా నేటి వరకు స్లాబ్ పనులు మాత్రమే పూర్తయి గోడల నిర్మాణం జరుగుతోంది. స్థలం, కాంట్రాక్టర్, ఇతర సమస్యలతో ఈ భవన నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పనులు నేటికీ నత్తనడకనే సాగుతున్నాయి.


అప్‌గ్రేడ్‌కు నోచుకోని అగ్నిమాపక కార్యాలయం


పూర్తి కాని పత్తిపాక రోడ్డు విస్తరణ పనులు

నత్తనడకన 'డబుల్' నిర్మాణాలు..

మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్ రూం ఇళ్లు 360 మంజూరు కాగా 200 మాత్రమే పూర్తయ్యాయి. అలాగే, 26వ వార్డు పరిధిలోని సిగ్నల్ కాలనీలో డంప్ యార్డులో మల వ్యర్థ శుద్ధి ప్లాంట్ (బయో మైనింగ్)మంజూరు కాగా ఆ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి.

శిథిలావస్థలో పలు కార్యాలయాలు..

తహసీల్, ఇరిగేషన్, తపాలా కార్యాలయాలు శిథిలావస్థలోనే కొనసాగుతున్నాయి. నిజాం హయాంలో నిర్మించిన భవనాల్లోనే అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. పీజీ కళాశాలకు సొంత భవనం లేదు.

ప్రధాన రహదారుల్లో మాత్రమే అభివృద్ధి..

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో మాత్రమే రోడ్ల విస్తరణ, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ జంక్షన్ల అభివృద్ధితోపాటు సుందరీకరణ పనులు పూర్తి చేశారు. కానీ విలీన గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు పూర్తి సాయిలో జరగలేదు. మానుకోట మున్సిపాలిటీలో ఈదులపూసపల్లి, అనంతారం, జమాండ్లపల్లి, బేతోల్, రజాలిపేట, శనిగపురం గ్రామాలు విలీనం చేయగా అభివృద్ధి ఏమాత్రం జరగలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో కూడా అసంపూర్తి కాల్వలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి పందుల సంచారం పెరిగి దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పూర్తి కాని మిషన్ భగీరథ ట్యాంకుల నిర్మాణాలు..

నాలుగు సంవత్సరాలు క్రితం మిషన్ భగీరథ ట్యాంకుల నిర్మాణ పనులు ఓ కాంట్రాక్టర్ అప్పగించగా ఏ కారణంతోనే అతడు చేతులెత్తేశాడు. దీంతో 2020లో మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే నేటి వరకు ఒక ట్యాంక్ నిర్మాణమే పూర్తయింది. మిగతా నిర్మాణాలు పూర్తి కాలేదు. ఆ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. 124 కి.మీ మేర పైపులైన్ వేశామని చెబుతున్నా నేటికీ పలు కాలనీల్లో ఆ పనులు చేయడం లేదు. పైగా పాత పైపులైన్‌కే కనెక్షన్లు ఇవ్వడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ చెబుతున్నారు.

అప్‌గ్రేడ్‌కు నోచుకోని అగ్నిమాపక కేంద్రం!

మానుకోట జిల్లాగా ఏర్పాటైనా అగ్నిమాపక కేంద్రం మాత్రం అప్‌గ్రేడ్ కాలేదు. డివిజన్ స్థాయి కేంద్రంగానే సేవలు అందిస్తోంది. ఆ కేంద్రంలో కూడా సిబ్బంది కొరత, ఇతరత్రా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇంజనీరింగ్ కళాశాల మంజూరైనా తగ్గట్టు సౌకర్యాలు లేవు. మానుకోట మండలంలోని మల్యాల కేవీకే, హెచ్ఆర్ఎస్ పరిశోధన కేంద్రంలో హార్టికల్చర్ డిగ్రీ కళాశాల మంజూరైనా ఆ గ్రామానికి రోడ్డు సరిగా లేదు.

రూ.50 కోట్లు మంజూరు

ఇటీవల సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 50 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో వార్డుల్లో రోడ్లు, కాల్వల నిర్మాణాలు చేపట్టారు. అవి పూర్తయితే కొంత మేరకు పారిశుద్ధ్య, ఇతర సమస్యలు తీరుతాయి. దోబీ ఘాట్, విత్తన శుద్ధి కేంద్రాలకు స్థలం కేటాయించారు. అయితే స్థలాల విషయంలో సమస్య నెలకొంది. ఫలితంగా నిర్మాణాలు జరగడం లేదు. పత్తిపాక రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు రాకపోకల పరంగా ఇబ్బందులు పడుతున్నారు.


కంకరబోడ్ ప్రాంతంలో నత్తనడకన సాగుతున్న మిషన్‌భగీరథ ట్యాంక్ నిర్మాణ పనులు

మానుకోట నియోజకవర్గ ప్రత్యేకతలు

- మానుకోట, కేసముద్రంలో రెండు వ్యవసాయ మార్కెట్‌లు ఉన్నాయి. కాగా, కేసముద్రం మార్కెట్ పసుపు కొనుగోళ్లలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటి స్థానం, తెలంగాణలో రెండో స్థానంలో ఉంది. పసుపు,పత్తి పంటలకు అనుకులమైన నేలలు మల్యాలలో కేవీకే, హెచ్ఆర్ఎస్ పరిశోధన కేంద్రాలు
- ఎక్కువ సంఖ్యలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులున్నారు. క్రీడల పరంగా మానుకోట నియోజకవర్గం పెట్టని కోట..
- క్రీడల్లో రాణించిన ఉద్యోగాలు పొందిన వారు కూడా ఎక్కువే..
- ఇనుగుర్తి మండలంలో కాకతీయ కాలం నాటి ఆనవాళ్లు ఉన్నాయి.
- మానుకోట, కేసముద్రం, ఇనుగుర్తి, తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్లు


జిల్లా కేంద్రంలోని భవానీనగర్ తండాలో డ్రెయినేజీ లేక రోడ్డుపైనే పారుతున్న మురుగు నీరు

16 నుంచి రైల్వే సీసీఎస్ డైరెక్టర్ల ఎన్నికకు నామినేషన్లు



కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) డైరెక్టర్ల ఎన్నిక నామినేషన్ల ప్రక్రియ నవంబర్ 16వ తేదీ నుంచి ప్రారంభం కానుందని ఇటీవల గెలుపొందిన సీసీఎస్ డెలిగేట్స్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు డైరెక్టర్ల ఎన్నిక నామినేషన్ల ఉత్తర్వులను సికింద్రాబాద్ అధికారులు వెల్లడించినట్లు తెలిపారు. కాజీపేట నుంచి గెలిచిన 13 మంది సీసీఎస్ డెలిగేట్స్ కాజీపేట డైరెక్టర్ పోస్టుకు నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. నామినేషన్ వివరాలు.. 16వ తేదీన నామినేషన్ ఫామ్ జారీ, 17వ తేదీన స్క్రూటినీ, 18న నామినేషన్ల విత్‌డ్రా, ఫైనల్ లిస్ట్, 25న డైరెక్టర్ ఎన్నికకు పోలింగ్, ఓట్ల కౌంటింగ్, గెలుపొందిన డైరెక్టర్ల పేర్ల ప్రకటన ఉంటుందని తెలిపారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి


లక్ష్మీనారాయణ మృతదేహం

బయ్యారం: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని గంధంపల్లి-కొత్తపేటలో జరిగింది. గ్రామానికి చెందిన ముత్తంశెట్టి నాగేశ్వరరావు రెండో అంతస్తు నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన పాయం లక్ష్మీనారాయణ(36) భవన నిర్మాణ పనికి వచ్చాడు. ఈ క్రమంలో పని చేస్తూ పై అంతస్తు నుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..


రమాకాంత్ (ఫైల్)

కమలాపూర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి అంబాల ఎస్సీ కాలనీ సమీపంలో జరిగింది. కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన కుమ్మరి రమాకాంత్ (28) ద్విచక్రవాహనంపై గూడూరు నుంచి అంబాల వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అంబాల ఎస్సీ కాలనీ వద్ద హార్వెస్టర్ చైన్ మిషన్‌ను తీసుకొస్తున్న డీసీఎం ఢీకొంది. ఈ ప్రమాదంలో రమాకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై సీమా ఫర్వీన్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రుడిని 108 ద్వారా వరంగల్ ఎంజీఎం తరలించి వివరాలు సేకరించారు. రమాకాంత్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య పూజిత, కుమారుడు, కూతురు ఉన్నారు.

కార్తీకమాసోత్సవాలను ప్రారంభిస్తున్న ఏసీ సునీత



కార్తీకమాసోత్సవాలు షురూ!

హన్మకొండ కల్చరల్ : రుద్రేశ్వర స్వామి వేయిస్తంభాల దేవాలయంలో కార్తీకమాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీక శుద్ధ పాడ్యమి మంగళవారం ఉదయం 5 గంటల నుంచి ఆలయప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితుడు మణికంఠశర్మ, అర్చకులు ప్రభాతసేవ, మూలగణపతికి ఆరాధన, గణపతి సూక్త మంత్రపఠనంతో నవరసాభిషేకం, రుద్రేశ్వరశివలింగానికి పాశుపత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సామూహిక రుద్రాభిషేకాలు జరిగాయి. దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత దేవాలయాన్ని సందర్శించి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం కార్తీకమాసోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

● పరిస్థితి విషమం

మంగపేట/ఏటూరునాగారం: మండలంలోని మల్లూరులోని అటవీ ప్రాంతంలో ప్రేమజంట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కమలాపురానికి చెందిన మాదరి శిరీష, ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన బెజ్జంకి రాజేశ్ ఏటూరునాగారం డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నారు. వీరు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే వీరి పెళ్లికి ఇరు కుటుంబాల సభ్యులు అంగీకరించడం లేదు. దీంతో మనస్తాపం చెందిన శిరీష, రాజేశ్.. మల్లూరులోని హేమాచల క్షేత్రానికి వెళ్లే మార్గమధ్యలోని అటవీ ప్రాంతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అనంతరం ఈ విషయాన్ని తమ తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని ఇద్దరిని 108లో ఏటూరునాగారం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108లో ములుగు జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.

'దీపావళి బతుకమ్మ' సంబురాలు


నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న నేతకాని కులస్తులు

- వైభవంగా కొనసాగుతున్న ఉత్సవాలు
- నేడు ముగింపు..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సీతంపేటలో 'దీపావళి(నేతకాని) బతుకమ్మ' సంబురాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర స్వామి వ్రతాన్ని ఆచరించారు. పురుషులే ఈ వ్రతాన్ని ఆచరించడం విశేషం. ఈ సందర్భంగా దేవుడి (ఎద్దులు) ప్రతిమలను ఊరేగించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేసి, ఉపవాస దీక్షను విరమించారు. ఈ సందర్భంగా చెరువు నుంచి నీటిని ఇంటికి తీసుకొచ్చి ప్రత్యేక గదిలో భద్రపరిచి పూజలు నిర్వహించారు.

నేడు ముగింపు..

మూడు రోజుల పాటు నిర్వహించే దీపావళి బతుకమ్మ వేడుకలు బుధవారం ముగియనున్నాయి. ఈ సందర్భంగా చెరువు వద్ద భారీ ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ శరత్‌కుమార్ తెలిపారు. వేడుకలకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని సర్పంచ్ శరత్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు బండారి రజిత తెలిపారు.


చెరువు వద్ద పూజలు..


జోడెద్దుల ప్రతిమల నిమజ్జనం..

కుటుంబ కలహాలు.. వివాహిత ఆత్మహత్య


కామేశ్వరి(ఫైల్)

వాజేడు: కుటుంబ కలహాలతో ఓ వివాహిత గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నాగారంలో జరిగింది. బంధువుల ప్రకా రం ప్రకారం.. గ్రామానికి చెందిన చింత కామేశ్వరి(24), తన భర్త ధర్మరాజుకు మధ్య సోమవారం స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన కామేశ్వరి సమీపంలోని గోదావరి నదిలో దూకింది. ఇంటి నుంచి బ యటకు వెళ్లిన కామేశ్వరి ఎంతకూ రాక పోవడంతో భర్త, అత్తామామ, బావ, పిన్ని గ్రామంలో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవ డంతో అనుమానం వచ్చి సోమవారం రాత్రి నుంచి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం కామేశ్వరి మృతదేహం లభించింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సివిల్ ఆసుపత్రికి తరలించారు.